భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ కార్తీక మాసం సందర్భంగా ఆదివారం కాచిగూడలోని మున్నూరు కాపు మ్యాడం అంజయ్య హాల్‌లో సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రత వేడుకల్లో మున్నూరు కాపులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్‌రావు, మహాసభ ప్రతినిధులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



ముషీరాబాద్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ శాసన సభ్యుడిగా ఎన్నికైన దన్‌పాల్ సూర్యనారాయణగుప్తాను ఆదివారం ముషీరాబాద్ ప్రధాన రహదారిలోని ఆర్యవైశ్య హాస్టల్‌లో ముషీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య హాస్టల్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త, జితేందర్‌గుప్తా, రాజశేఖర్‌గుప్తా, మల్లేశం, గౌరయ్య, ప్రకాష్, శివకుమార్, ప్రేమ్‌గాంధీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

కాచిగూడ: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నేత రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ అంబర్‌పేటలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నదానం ఎంతో పుణ్యకార్యమని, ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీఆర్ఎస్ నేత శ్రీరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘చేయూత’తో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్

- మహాలక్ష్మి పథకం మహిళల ప్రగతికి దోహదం
- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



మహాలక్ష్మి, చేయూత పథకాల పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు



మహిళలకు ఉచిత బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకంతో నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చేయూత (రాజీవ్ ఆరోగ్యశ్రీ), మహాలక్ష్మి పథకాల పోస్టర్‌లను ఆదివారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత, ఆస్పత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... చేయూత పథకం ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చులను రూ. 5 నుంచి రూ. 10 లక్షలకు పెంచడంతో నిరుపేద రోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే క్లిష్టమైన, అరుదైన సర్జరీలు నిరుపేదలకు అందుబాటులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.

మహాలక్ష్మి పథకంతో మహిళల ప్రగతి...

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సేవలు అందించడం మహిళల ఆర్థిక ప్రగతికి ఎంతగానో తోడ్పడుతుందని అదనపు కలెక్టర్ మధుసూదన్ చెప్పారు. విద్యార్థినులకు ఎంతో ఉపకరిస్తుందని, మహిళలకు వ్యాపార, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఆర్టీసీ బస్సును జెండా ఊపి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు, స్పెషల్ ఆఫీసర్ అపర్ణ, అంబర్‌పేట తహసీల్దార్ భిక్షపతి పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణ వైపు మరో అడుగు



ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ కలెక్టర్ లావణ్య

ముషీరాబాద్: ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు ఉన్న రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం హర్షణీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం రాజీవ్ ఆరోగ్య శ్రీ లోగో ఆవిష్కరణ కార్యక్రమం ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ లావణ్య, ముషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ హేమంత్, ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దీప్తి ప్రియాంక, భోలక్‌పూర్ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మెహరీన్, ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ పద్మజ, పీహెచ్ఎం భాగ్యలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని పెంచడం శుపరిణామం అని కొనియాడారు రాష్ట్రంలోని పేదలందరికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందనుందని తెలిపారు. అయితే ఆరోగ్య శ్రీ గుర్తింపుకార్డులు అందరికీ అందేలా చూడాన్నారు. కార్పొరేటర్లు సుప్రియనవీన్‌గౌడ్, కె.రవిచారి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు, పింఛన్‌లు గానీ ఇవ్వలేదన్నారు.



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం..

ముషీరాబాద్ డిపో–2 మేనేజర్ పి.కిషన్‌రావు ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు.

మందులు అవసరం లేని వైద్యం ఆక్యుపంక్చర్



ఆక్యుపంక్చర్ వైద్య సేవలు పొందుతున్న ప్రజలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మందులు అవసరం లేని వైద్యం ఆక్యుపంక్చర్ విధానం అని దీనిలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వీకే ట్రస్ట్, ఆరోగ్య ఆక్యుపంక్చర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుపంక్చర్ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... బీపీ, షుగర్ లాంటి అనేక దీర్ఘ కాలిక వ్యాధులతో పాటు అనేక వ్యాధులను ఆక్యుపంక్చర్ ద్వారా నయం కావడం అభినందనీయమన్నారు. ఒక్క నీడిల్ వేల రోగాలను నయం చేస్తుంది అనడంలో సందేహం లేదన్నారు. హీలర్ కాపర్తి జనార్ధన్ మాట్లాడుతూ... ఆక్యుపంక్చర్ విధానంలో శరీరమే వైద్యుడు, ఆహారమే ఔషధమని తెలిపారు. ఆక్యుపంక్చర్ వైద్య విధానం అతి పురాతనమైందని నేడు మన దేశంలో కూడా బహుళ ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలిపారు. అందరూ కూడా ఆక్యుపంక్చర్ వైపే మొగ్గుచూపుతున్నారని తెలిపారు. శిబిరంలో సుమారు వంద మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో సమాచార హక్కు శాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ పి.ఎస్.సాగర్, పలువురు హీలర్స్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్య రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ



నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి: వందేళ్ల క్రితమే మాలపల్లి నవల రాసి సమాజంలోని రుగ్మతలను విమర్శణ చేసిన ఉన్నవ లక్ష్మీ నారాయణ సామాజిక చైతన్య రచయిత అని ప్రముఖ గీత రచయిత వడ్డేపల్లి కృష్ణ కొనియాడారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఉన్నవ లక్ష్మీ నారాయణ సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ... తెలుగు నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన రచయితగానేకాక గాంధీజీ పిలుపు నందుకొని దళిత దీన జన ఉద్ధరణకు కార్యాచరణ చేపట్టిన మహనీయులు అని వివరించారు. వేదికపై కళాపోషకుడు గుదిబండి వెంకట్‌రెడ్డి, సూరి భగవంతం ట్రస్ట్ స్థాపకుడు ఎస్.బి.రామ్, సమాజ సేవకుడు వైకుంఠం, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొన్నారు.

చెప్పల్‌బజార్‌లో కలుషిత నీటిని అరికట్టండి

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో కొద్ది రోజులుగా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నందున నీటి కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికులు సమస్యను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ సమస్యను అధికారులకు వివరించారు. మంచినీటి పోల్యూషన్ వస్తున్న ప్రాంతాన్ని ఆమే ఆదివారం జలమండలి సిబ్బంది, బీజేపీ నేతలతో కలిసి పర్యవేక్షించారు. చెప్పల్‌బజార్‌లో మంచినీటి పోల్యూషన్ సమస్యను సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. బీజేపీ నేతలు ఎల్.సత్యనారాయణ, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్

ముషీరాబాద్ అభివృద్ధికి నిరంతర కృషి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసిన ముఠా గోపాల్ ఆదివారం జనహిత ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గాంధీనగర్‌లోని ఆయనను నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గం అభివృద్ధికి నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పున్న రాజ్‌మోహన్, ప్రకాష్, రఘువీర్, శివ, శ్యామ్, దోనేటి సత్యం, క్రాంతి, కాలెబ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే కాలేరుకు శుభాకాంక్షలు



కాచిగూడ: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జన్మదినం సందర్భంగా ఆదివారం కాచిగూడ, గోల్నాక డివిజన్‌లకు చెందిన బీఆర్ఎస్ నేత కాలేరు రాజు నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి పూలబోకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మ దేవ్, ప్రధాన కార్యదర్శి కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునిల్ బిడ్లాన్, పెంట రమేష్, గోల్నాక డివిజన్ నేతలు కాలేరు రామకృష్ణ, భరత్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ బాకారం బస్తీలో ధర్మాచరణ సమితి ఆధ్వర్యంలో ఐదవ బొడ్రాయి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. ధర్మాచరణ సమితి అధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

లిబర్టీ: మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ అన్నారు. రాజ్యాంగ హక్కులను రక్షించుకోవాలని దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కనీసం జీవించే మానవ హక్కులు దళిత బహుజన కుల అందటం లేదన్నారు. పార్టీ నాయకులు దేవుని శ్రీనివాస్, బీరం సతీష్‌కుమార్, ఇటికాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లు భట్టివిక్రమార్కకు సన్మానం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆర్పీఐ జాతీయ కార్యదర్శి సి.హెచ్.బాలకృష్ణ ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. మల్లు భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా, విద్యుత్ శాఖ మంత్రిగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చాలా కాలం తరువాత దళిత వర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రి కావడం దళిత బహుజనులకు గొప్ప గౌరవం దక్కిందని ఆయన అన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

కాచిగూడ: మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1969 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆపూర్వ ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఆదివారం నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. పూర్వ విద్యార్థులు సిటి పార్థసారథి, షడ్గుణ దీప్ కుమార్, సి.వి.లక్ష్మీ, సి.నరసింహారావు వేడుకలకు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో తమ అనుబంధాలను గుర్తు చేసుకుంటూ తన్మయత్వంలో మునిగిపోయారు. ఈ సదర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన పూర్వ విద్యార్థులకు బహుమతులు అందజేసి ఘనంగా అభినందించారు. 70 ఏళ్ల వయస్సు నిండిన 13 మంది పూర్వ విద్యార్థులకు పగిడి, ముత్యాల హారం, శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతటి వారిని చేసిన గురువులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కళలతో ఆత్మవిశ్వాసం

చిక్కడపల్లి: కళలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని గాయకురాలు, జర్నలిస్ట్ స్వప్న అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య, వాయిద్య, సంగీత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతిమనుగడకు సంస్కృతి, సంప్రదాయాలే ఆధారమని విద్యావేత్త శ్రావణ్‌కుమార్ అన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ప్రథమ గురువులని వారికి ఆసక్తిఉన్న కళల్లో శిక్షణనిప్పించాలన్నారు. వాహిని సంస్థ చిన్నారకు సైతం కళల్లో శిక్షణ నివ్వడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న స్వప్న

తొలుత బాలలు పాడిన శ్లోకాలు, వర్ధమాన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, వీణావాదనం సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అచ్యుతకుమారి, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, నిర్వహణ సంస్థ వ్యవస్థాపకురాలు శంకరమంచి లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

నల్లకుంట: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మానవ సేవే మాధవ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యానగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని స్ఫూర్తి స్నేహ బాయ్స్ హోం (అనాథ విద్యార్థుల వసతి గృహం) విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆదివారం బాయ్స్ హోంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, చింతల ధనార్జున్‌రెడ్డిలతో కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేసి మాట్లాడారు. కార్యక్రమంలో మానవసేవే మాధవ సేవ సంస్థ అధ్యక్షుడు రాజేష్ అరోరా, స్ఫూర్తి బాయ్స్ హోం వ్యవస్థాపకుడు దిలీప్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సి.హెచ్.మురళీకృష్ణ, పండరీనాథ్, ప్రభుదాస్, సతీష్, విజయ్ కిరణ్, సంఘ సేవకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాల్లో మహేష్‌యాదవ్ ఆదర్శం

ఖైరతాబాద్: నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతో గత 21 సంవత్సరాలుగా నిరంతరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహేష్ యాదవ్ ఎంతో మందికి ఆదర్శమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలకు, వృద్ధులకు, ఫుట్‌పాత్‌పై పడుకునే వారికి 500 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... మహేష్‌యాదవ్ తండ్రి జ్ఞాపకార్థం ఏటా స్కూల్ బ్యాగులు, డ్రెస్‌లు, వాటర్ క్యాంపులతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారన్నారు.

మంత్రి రాజనర్సింహకు అభినందన



కాచిగూడ: పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 3194 (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నేతలతో కూడిన ప్రతినిధి బృందం ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పూల బోకే అందజేసి అభినందనలు తెలియజేశారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్యాంసుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఐపీఎం బ్రాంచ్ అధ్యక్షుడు రాసూరి జ్ఞానేశ్వర్, ఎం.శ్రీనివాస్, వేణుగోపాల్‌గౌడ్, గోవింద్ రెడ్డి, విజయ్ భాస్కర్, కె.అనిల్, ఎం.హెచ్.రామరావు, సత్యనారాయణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మీడియా ఫైన్ ఆర్ట్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్‌లో వివిధ వీకెండ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కూచిపూడి, కథాకళి డ్యాన్స్‌లో సర్టిఫికెట్ కోర్సులు, పార్ట్ టైమ్ వీకెండ్ యాంకరింగ్, డబ్బింగ్, యాక్టింగ్, సంకీర్తన, స్పోకెన్ సంస్కృత్ తరగతులు, విజువల్ ఆర్ట్స్ (ఆరు నెలలు), వీణ, వయోలిన్, కీ బోర్డు, ఫ్లూట్, గిటార్ తదితర ఫైన్ ఆర్ట్స్ వీకెండ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఉషా జ్యోతిమణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ నెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 040 2707 0052, సెల్: 97013 27539, 94417 68811లలో ఆఫీస్ పనివేళల్లో సంప్రదించాలన్నారు.

ఘనంగా సంగీత నృత్యోత్సవం



సంగీత నృత్యోత్సవంలో పాల్గొన్న కళాకారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రీ లలిత కళానృత్య నికేతన్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భారతీయ సంగీ నృత్యోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నృత్యకారులు నిర్వహించిన శివపాద మంజీర నాథం విశేషంగా ఆకట్టుకుంది. పలువురు కళాకారులు చేసిన భరతనాట్యం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చినుకు కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి, ప్రముఖ కవి పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ... మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే తలమానికం అన్నారు. విద్యార్థులు శివపాద మంజీర నాథం పేరుతో ప్రదర్శించిన భరతనాట్యం చేసి ప్రేక్షకులతో శభాష్ అనిపించుకున్నారు. కార్యక్రమంలో కళాసేవ విభూషణ్, నాట్య గురువు డాక్టర్ అరవ ఆంజనేయులు, నాట్య గురువు జట్ల చిన వీరభద్రరావు, బాలోత్సవ నిర్వహకులు సుజావతి, నాట్యాచార్యులు సి.హెచ్.వాణి, వెంకటవరప్రసాద్, రాధికమోహన్, రాధిక శ్రీనివాస్, అనుదీప్తి, సరస్వతీ, మహల్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ విద్యార్థి హాస్టల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డికి ముదిరాజ్‌ల పక్షాన అఖిల భారత ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సుప్రీం కోర్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చిన కేసు నెంబర్ ఎస్ఎల్‌పీ11583/2010 పరిష్కరించి ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూపులోకి చేర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీఓ నెంబర్ 15/2019 అమలు చేస్తూ ముదిరాజ్ విద్యార్థి హాస్టల్ నిర్మాణం కోసం దోమల్‌గూడ, అశోక్‌నగర్‌లలో స్థలం కేటాయించాలని ఆయన కోరారు. హాస్టల్ ఏర్పాటుతో విద్యకు దూరమైన ముదిరాజ్‌లకు మేలు చేకూరుతుందని, బీసీ–ఏ గ్రూపులో చేర్చడంతో ప్రభుత్వం త్వరలో విడుదల చేయబోయే ఉద్యోగాల నియామకాల్లో ముదిరాజ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌ల పట్ల సానుకూలంగా వ్యవహరించి ఆదుకోవాలని ఆయన కోరారు.

హక్కులపై ప్రజలకు మరింత చైతన్యం అవసరం

మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య

హిమాయత్‌నగర్: మానవ హక్కుల పట్ల ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ... రాజ్యాంగం ప్రజలకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా ఇచ్చిందని... వాటికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. విద్య అన్నింటికీ మూలమని, విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ విద్య ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చట్టం కఠినంగా శిక్షిస్తుందనే విషయాన్ని మరచిపోవద్దని, చట్టం ప్రతి ఒక్కరికీ సమానమే అని జస్టిస్ చంద్రయ్య స్పష్టం చేశారు. కౌన్సిల్ చైర్మన్ మహమ్మద్ షేక్‌షా మాట్లాడుతూ... హక్కుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా మానవ హక్కులపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్ట్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్, షెక్ ఆస్మా, అబ్దుల్ సలీమ్, అక్రమ్ షెక్ తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పథకం అమలు చేయాలని మంత్రికి వినతి

పంజగుట్ట: సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతూ తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఐటీ శాఖా మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు పుప్పాల కృష్ణ కుమార్, హన్మండ్ల భాస్కర్ మాట్లాడుతూ... 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు సీపీఎస్ విధానం అమలవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ మూడు రోజుల్లోనే ఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రారంభించినందుకు అభినందనీయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రీధర్‌బాబు పలు మార్లు అసెంబ్లీలో సీపీఎస్ రద్దు అంశాన్ని లేవనెత్తారని, పార్టీ మేనిఫెస్టోలో కూడా సీపీఎస్ విధానం అంశాన్ని పొందుపర్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా సీపీఎస్ పింఛన్ విధానాన్ని రద్దు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. కార్యక్రమంలో హర్షవర్ధన్ రెడ్డి, పులి దేవేందర్, చేరాల తిరుపతి, ఆకుల చంద్రశేఖర్, తాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.